
క్లుప్తంగా

సాయిబాబా మందిరానికి విరాళం



క్రోసూరు: స్థానిక సాయిబాబా మందిరానికి భక్తులు రెండు గంగాళాలు అందజేశారు. ఈ సందర్భంగా మందిర కమిటీ చైర్మన్ మన్నెం వెంకట్రావు మాట్లాడుతూ బాబాకి 40 కిలోల బరువు కలది(రూ.60 వేలు) ఇత్తడి గంగాళంను పాలడగు గ్రామానికి చెందిన దంపతులు బండ్లమూడి నాగేశ్వరరావు, పరమదేవీ, 20 కిలోల బరువుగల (రూ.28 వేలు) గంగాళంను గడ్డిపాటి శ్రీనివాసరావు, స్వర్ణకుమారి దంపతులు అందజేసినట్లు చెప్పారు. మండలంలోని సాయిబాబు మందిర భక్తులు మంగళవారం నుంచి భిక్షాటన కార్యక్రమం ప్రారంభించారు.

అమరేశ్వరుని సేవలో నాగార్జున యాదవ్



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అమరేశ్వరాలయంలో ఆలయాధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతినిత్యం ఆలయంలో జరిగే రుద్రహోమంలో పాల్గొన్నారు.

చిన్నారులకు చేయూత



సత్తెనపల్లి: మురికివాడలో నివసిస్తున్న చిన్నారులకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని ది హెల్ప్ టు హోప్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె.రవి కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వడ్డవల్లి ఏరియాలోని మురికివాడల్లో మంగళవారం చిన్నారులకు ఆహారం అందించి గుడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికివాడల్లో నివసిస్తున్న చిన్నారులకు తమకు తోచిన సాయాన్ని అందించాలని కోరారు. ఆరోగ్యంపై చిన్నారులకు అవగాహన కల్పించారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లులో భాగంగా నిర్మిస్తున్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి పీడీ శివలింగం ఆదేశించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని లే అవుట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ నెల 30న గృహ ప్రవేశాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆర్బీ పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఆయనతో పాటు గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదలకు చెందిన భార్యాభర్త ద్విచక్రవాహనంపై నుంచి పడి గాయపడిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. మండలంలోని మాదల ఎస్సీ కాలనీకి చెందిన బొడ్డేటి వెంకయ్య భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై ముప్పాళ్ల నుంచి వస్తూ ప్రమాదవశాత్తూ పెట్రోల్‌బంక్ సమీపంలో కింద పడ్డారు. ఎవరూ పట్టించుకోకపోవటంతో, అదే సమయంలో సత్తెనపల్లి నుంచి వస్తున్న మాజీ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి గమనించారు. వెంటనే కారు దిగి చికిత్స నిమిత్తం ఆటోలో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు పంపించారు.

సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పక్కన మంత్రి అంబటి రాంబాబు, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, మాజీ ఎమ్మెల్యే యర్రం

- ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

సత్తెనపల్లి: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కోరారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్‌తో కలసి సమీక్ష నిర్వహించారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడకూడదని, ఆ సమస్యలు అన్ని పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు ఉంటే వాటిని మా దృష్టికి తీసుకొస్తే అవసరమైతే కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలోనూ ఇన్‌చార్జి మంత్రులు ఈ సమీక్షలు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రాధాన్య రంగాల భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు, విద్యా, వైద్య ఆరోగ్యశాఖలలో చేపట్టిన నాడు– నేడు పనులు, రహదారులు భవనాల శాఖ, ఇరిగేషన్, గృహ నిర్మాణ శాఖ, విద్యుత్, జగనన్న ఇళ్ల స్థలాలు, వన్ టైం సెటిల్మెంట్, డిస్ట్రిక్ మినరల్ ఫండ్, తదితర అంశాల పైన సమీక్ష నిర్వహించారు.

జెడ్పీ స్థలంలో ఉంటున్న వారికి పట్టాలు..

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ కార్యాయలం ఎదుట జిల్లా పరిషత్‌కు చెందిన 157/7 సర్వే నంబర్‌లో 1.10 ఎకరాలలో సుమారు 50 ఏళ్లుగా స్థానికులు గృహాలు నిర్మించుకొని ఉంటున్నారని చెప్పారు. వీరికి పట్టాలు అందించేలా చర్యలు తీసుకుందామన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్‌కు సంబంధించిన శాఖ అధికారులు, కలెక్టర్ సహకారంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో దేవదాయ శాఖకు చెందిన 7.83 ఎకరాల స్థలంలోనూ స్థానికుల గృహాలు నిర్మించుకున్నారని వీరి సమస్య, రాజుపాలెం మండలంలో నిర్మించాల్సిన బీసీ బాలికల ఆశ్రమం పాఠశాల సమస్యను ఇన్‌చార్జి మంత్రి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని సూచించారు.

➡ నియోజకవర్గంలో 60 గ్రామ సచివాలయాలు మంజూరు కాగా 36 భవనాలు పూర్తి కాగా 19 భవనాలు వివిధ దశలలో నిర్మాణాల్లో ఉన్నాయని, 5 భవనాలు ప్రారంభం కాలేదని ఆ శాఖ అధికారులు వివరించారు. రైతు భరోసా కేంద్రాలు 50 మంజూరు కాగా 27 భవనాలు పూర్తి కాగా 9 భవనాలలు వివిధ దశలలో ఉండగా 14 ప్రారంభం కాలేదని వివరించారు. వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ భవనాలు 48 మంజూరు కాగా ఇప్పటి వరకు 24 పూర్తి కాగా 23 భవనాలు వివిధ దశలలో ఉన్నాయని, ఒకటి ప్రారంభం కాలేదని పంచాయతీ రాజ్ డీఈ శేఖర్ బాబు వివరించారు.

➡ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 2.40 కోట్లు పని దినాలు కల్పించి రూ.117.57 కోట్లు వేతనాల రూపంలో చెల్లించామని ఏపీడీ వెంకటనారాయణ తెలిపారు.

➡ నాడు – నేడులో భాగంగా పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు రెండు దశలో 1,512 పనులకు గాను రూ.72.65 కోట్లు కేటాయించటం జరిగిందని, రెండో విడత ఫేజ్ పనులు జరుగుతున్నట్లు విద్యాశాఖాధికారులు వివరించారు.

➡ నియోజకవర్గంలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లలో భాగంగా 4,867 గృహాలు మంజూరు కాగా 889 గృహాలు బీబీఎల్‌లో, 1,881 గృహాలు బీఎల్‌లో, 207 గృహాలు ఆర్ఎల్‌లో, 229 గృహాలు రూఫ్‌కాస్ట్‌లో, 1,806 గృహాలు కంప్లీషన్ అయినట్లు గృహ నిర్మాణశాఖ డీఈ శ్రీనివాసరెడ్డి వివరించారు. అలాగే నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి పీఎంఏవై కింద 3,053 గృహాలు మంజూరు కాగా 1,258 గృహాలు బీబీఎల్‌లో, 263 గృహాలు బీఎల్‌లో, 152 గృహాలు రూఫ్‌కాస్ట్‌లో, 258 గృహాలు కంప్లీషన్ కాగా 902 గృహాలు ప్రారంభం కాలేదని వివరించారు. అర్బన్ పరిధిలో ఐదు, రూరల్ పరిధిలో 22 లేఅవుట్‌లు ఉన్నాయన్నారు. ఈ నెల 30న గృహ ప్రవేశాల నాటికి ధూళిపాళ్ల లేఅవుట్‌లోని గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నామని వివరించారు. గృహాలు పూర్తి చేయడంతో పాటు అక్కడ మౌళిక వసతులు కల్పించాలని, ఆర్బీలు పూర్తి చేయాలని మంత్రి నాగేశ్వరరావు ఆదేశించారు.

➡ సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని కేంద్రీయ విద్యాలయానికి ప్రధాన రహదారి నుంచి రోడ్డు వేసేందుకు డీఎంఎఫ్ నుంచి రూ.40 లక్షలు, బాలుర గురుకుల పాఠశాలకు రోడ్డు వేసేందుకు రూ.20 లక్షలు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఈఈ కె.రామ్మోహన్‌సింగ్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన ఆ రెండు రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని మంత్రి నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి, డీఆర్వో వినాయకం, స్థానిక ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే నంబూరు, కలెక్టర్ శివశంకర్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధి సమీక్ష సమావేశం

పెదకూరపాడు: సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో పెదకూరపాడు నియోజకవర్గ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో కలసి పాల్గొన్న మంత్రి కారుమూరి మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారమే ధ్యేయం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నియోజవర్గంలో సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు తీర్చేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ఒక ఇల్లు కూడా మంజూరు కాని పది గ్రామాలు ఉన్నాయని వారికి వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. వీరితో పాటు సొంత స్థలాల్లో 2,894 మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారని వారికి హౌసింగ్ రుణాలు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గంలో అత్యవసర పనుల నిమిత్తం డీఎంఎఫ్ నిధులు రూ.3 కోట్లు ఇవ్వాలని విన్నవించారు. అచ్చంపేట మండలం సండ్ర తండాకు సిమెంట్ రోడ్డు వేయడానికి ఆర్వోఎఫ్ ఆర్ పట్టా ఇవ్వాలని కోరారు. అచ్చంపేట మండలంల ఎమ్మాజీగూడెం అర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ కింద పెండింగ్‌లో ఉన్న రూ.25 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. బెల్లంకొండ మండలం రామాంజనేయపురంలో సిమెంట్ రోడ్లు, బోర్లు వేయడానికి అనుమతులు కోరారు. జగనన్న లేఅవుట్లులో డెవలప్‌మెంట్ చేసిన బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఫిల్టర్ బెడ్స్ నిర్మాణం, సీపీఎస్ స్కీమ్ మెయింటెనెన్స్, జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. 75త్యాళ్ళూరు నుంచి తమ్మవరం వరకు, అచ్చంపేట మండలం మాదిపాడు నుంచి పులిచింతల డ్యామ్ వరకు పంచాయతీరాజ్ తారు రోడ్డు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని కోరారు. లంక భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు, అచ్చంపేట మండలం కోండూరులో చెరువు భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అచ్చంపేట మండలం చామర్తి రోడ్డు డొంకలో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. క్రోసూరు పాలిటెక్నిక్ కాలేజ్ ప్రహరీతో పాటు లెవలింగ్‌కు నిధులు మంజూరుకు సహకరించాలన్నారు. క్రోసూరు మండలం అందుకూరులో దేవదాయ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల అదనపు గదుల నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా సీఎం వైఎస్ జగన్ పాలన

మంత్రి కారుమూరి

సత్తెనపల్లి: దేశంలోని ముఖ్యమంత్రులందరూ మెచ్చుకుని రాష్ట్రం వైపు చూసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధి లలక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు, ఎన్ఎస్‌పీ కెనాల్ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన పనుల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ వంద శాతం అభివృద్ధి పనులు పూర్తి చేయించడంతో పాటు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతున్నట్లు చెప్పారు.

బీసీ గర్జన విజయవంతం



పట్టణంలో ప్రత్యేక వాహనంపై ర్యాలీగా వస్తున్న మంత్రులు కారుమూరి, అంబటి, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

సత్తెనపల్లి: బీసీ గర్జన విజయవంతమైంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సభకు పెద్దసంఖ్యలో బీసీలు తరలివచ్చారు. తొలుత పట్టణంలో ప్రత్యేక వాహనంపై అతిథులు ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలికారు. ఈ సందర్భంగా గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, విద్యాభివృద్ధి మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన యనమల నాగార్జున యాదవ్‌లను పూలమాలలు, గజమాలతో సత్కరించారు.

నేటి నుంచి గ్రామసభలు

ముప్పాళ్ల: మండలంలోని ఆరు గ్రామాల్లో జగనన్న భూహక్కు– భూరక్ష భూముల రీసర్వేపై ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం.భవానీశంకర్ మంగళవారం తెలిపారు. 23న పలుదేవర్లపాడు, దేవరప్పాడు రెవెన్యూ గ్రామాల్లో, 24న లంకెలకూరపాడు, నార్నెపాడు, 25న ముప్పాళ్ల, 26న మాదల గ్రామంలోను గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద జరిగే గ్రామసభలకు సర్పంచులు, మండల సర్వేయర్, వీఆర్వో, గ్రామ సర్వేయర్‌తో పాటుగా పలు శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

భవిత కేంద్రంలో 21 రకాల సేవలు



ప్రత్యేక అవసరాల పిల్లలకు స్పీచ్ థెరపి శిక్షణ ఇస్తున్న జయలక్ష్మి

నకరికల్లు: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం 21 రకాల కార్యక్రమాలు భవిత కేంద్రాల ద్వారా నిర్వహిస్తోందని ఐఈఆర్‌పీ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు మంగళవారం స్పీచ్‌థెరపి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి గురువారం ఉచిత ఫిజియోథెరపి క్యాంపు ద్వారా వ్యాయామాలు చేయించి ఇంటి వద్ద తిరిగి చేసుకునేలా తర్ఫీదు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శనివారం గుర్తించిన ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల ఇంటి వద్దకు వెళ్లి సేవలు అందిస్తామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ అందరికీ ఉపయోగపడుతుందని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం అందజేశారు. అమరావతి మండలం జిడుగు మండలానికి చెందిన వింత గౌతమికి రూ.2 లక్షలు, క్రోసూరుకు చెందిన షేక్ మస్తాన్‌బీకి రూ.55 వేలు, క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన సయ్యద్ దరియావలికి రూ.45 వేలు మొత్తం రూ.3 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడేవారు, వైద్యానికి ఖర్చుపెట్టే స్తోమత లేనివారు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో క్రోసూరు వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అబ్దుల్ ఘని, డాక్టర్ షరీఫ్ పాల్గొన్నారు.

ఆట్యా–పాట్యా క్రీడాకారులకు అభినందనలు



జూనియర్ ఆట్యా-పాట్యా జట్టు క్రీడాకారులతో ఉపాధ్యాయులు

నకరికల్లు: రాష్ట్ర స్థాయి ఆట్యా–పాట్యా జూనియర్ విభాగం చాంపియన్‌గా పల్నాడు జిల్లా జట్టు నిలిచింది. ఆ జట్టులో స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థులు ఎనిమిది హాజరై ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు టి.నగేష్ మాట్లాడుతూ ఆట్యా– పాట్యా పల్నాడు జిల్లా బాలుర జట్టులో కె.శ్రీనివాస్, షేక్ ఇస్మాయిల్, బాలికల జట్టులో పి.తిరుపతమ్మ, టి.రామాంజలి, పి.స్రవంతి, కె.సరిత, బి.మౌనిక, కె.సౌమ్యశ్రీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ షేక్ మస్తాన్‌వలి, ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య, సిబ్బంది కె.వెంకటేశ్వరరావు, ఎం.అశోక్, సీహెచ్ ఓబయ్య, కె.సువర్ణరాజు, టి.కిరణ్మయి, ఏ స్వర్ణకుమారి, కె.హేమలతాకుమారి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

వెల్దుర్తి: మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలో శ్రీనాదిసిల(బొడ్డురాయి) మహాసితల శ్రీగమిడి సిలాయమంత్ర పోలేరమ్మ మాతా, పెద్దమ్మతల్లి, పోతురాజుస్వామి వార్ల శిలా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలిసి ప్రతిష్టా మహోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, సిద్ధాంతి పోతులూరి శివరామాచారి ఆధ్వర్యంలో 11 మంది వేద పండితులు ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు గురు పుణ్యదంపతులు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతా శివరామయ్య, గ్రామ సర్పంచి అనూసయ్య, ఎంపీటీసీ మంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గార్లపాటి పెదరామయ్య, గార్లపాటి వెంకట్రామయ్య, మాజీ ఎంపీపీ టి.వెంకయ్య, టి.బ్రహ్మం, టి.వెంకటేశ్వర్లు, మారుకొండయ్య, రామిరెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

అధిక ధరలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య

సత్తెనపల్లి: కేంద్ర, అధిక ధరలు తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య కోరారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ పల్నాడు జిల్లా శాఖ కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి నుంచి 7వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధరలను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 24న దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక సంఘాల నాయకులతో ఢిల్లీలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ , సీపీఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, గంజిమాల రవిబాబు, ఎస్.అంజనేయ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు గుంటుపల్లి బాలకృష్ణ, గద్దె ఉమశ్రీ, ధరణికోట విమల, శివకుమారి, హనుమంతరెడ్డి, గుంటూరు మల్లేశ్వరి, పాల్గొన్నారు.

ఓట్ల లెక్క తేలింది..!

- పక్కాగా పూర్తయిన ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే
- సత్తెనపల్లి నియోజకవర్గంలో 95.60 శాతం పూర్తి
- నియోజకవర్గంలో 2,32,998 మంది ఓటర్లు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఆర్డీఓ రాజకుమారి

సత్తెనపల్లి: ప్రతి ఏడాది ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –2024 పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. జూలై 21న ప్రారంభమైన ఈ సర్వే సోమవారం(ఆగస్టు 21)తో ముగిసింది. బూత్ స్థాయి అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పట్టణంలోని వార్డుల్లో, గ్రామాల్లో నేరుగా ఇంటింటికి వెళ్లి ఓటర్ల సర్వే చేసి పూర్తి వివరాలు సేకరించారు.

రాజకీయ పార్టీలతో సమావేశాలు .....

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరిస్తుంది. ఇంటింటి సర్వేను యోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి దగ్గరుండి పర్యవేక్షించారు. ఇంటింటికి వెళ్లి ఆమె స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత రాజకీయ పార్టీలతోనూ సమావేశాలు నిర్వహించారు. మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఇంటింటి సర్వే వివరాలను వెల్లడించారు.

సర్వే సాగింది ఇలా.....

అర్హత ఉండి 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే వారిని ఓటర్ల జాబితాలో చేర్చారు. వీరి నుంచి ఫారం–6తో పాటు వయసు ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. తప్పుల సవరణ, కొత్త ఓట్ల నమోదు, మృతులు, నకిలీ ఓట్లు గుర్తించారు. ఓటర్ల జాబితాలో ఒకటి కన్నా ఎక్కువ సార్లు ఓటు నమోదైనా, శాశ్వతంగా గ్రామం విడిచి వెళ్లిన వారు ఉంటే అలాంటి వారి ఓట్లు కూడా గుర్తించే అవకాశం కల్పించింది ఎన్నికల కమిషన్. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో ఫొటో సరిగ్గా కనిపించినట్లయితే మార్చుకునే అవకాశం కల్పిస్తారు. వయసులో వ్యత్యాసం ఉన్నా, ఇంటి చిరునామా మార్పు ఉన్నా, వ్యక్తిగత వివరాల్లో మార్పులు, చేర్పులు ఉంటే సవరించుకోవడానికి అవకాశం ఇచ్చారు. ఒకే ఇంట్లో పదికి మించి ఎక్కువ ఓట్లు ఉంటే వారిని గుర్తించి ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసి వారి ఓట్లు నిజమైతే వారికి తాత్కాలికంగా నోషనల్ ఇంటి నంబర్లు జారీ చేశారు. ఓటర్ల జాబితా సవరణకు ఓటర్ యాప్ వెర్షన్ 5.1 ద్వారా కొత్త ఓట్ల నమోదు, పాతవి తొలగించడం వంటివి యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు.

సర్వేలో గుర్తింపులు ఇలా...

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు	- 2,32,998 మంది
పురుషులు	-1,14,326 మంది
మహిళలు	-1,18,655 మంది
ఇతరులు	-17 మంది
సర్వే చేసిన ఓటర్లు	-2,22,741 మంది
సర్వే శాతం	-95.60 శాతం
ఆబ్‌సెంట్ ఓటరు	-3,464 మంది
షిఫ్టెడ్ ఓటర్లు	-728 మంది
చనిపోయిన ఓటర్లు	-1,858 మంది
ఫొటోలు సరిగ్గా లేని ఓటర్లు	-292 మంది
రిపీటెడ్ ఓటర్లు	-165 మంది

సర్వే సమయంలో వచ్చిన దరఖాస్తులు...

నమోదుకు ఫారం-6	- 1,972
తొలగింపునకు ఫారం7	- 1,549
అడ్రస్ మార్పుకు ఫారం-8	- 1,744

ఎస్సీ వర్గీకరణకు కలసి రావాలి

గురజాల: ఎస్సీ వర్గీకరణకు ప్రతి ఒక్కరూ కలసి రావాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. నగర పంచాయతీలోని బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ జెండా మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వీఎంఏఎస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

క్లుప్తంగా

అమరావతి ఎంపీడీవోగా ఉమాదేవి



అమరావతి: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి. ఉమాదేవి బుధవారం బాధ్యతల్ని స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన మాధురి కమిషనర్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకల హనుమంత రావు ఆధ్వర్యంలో సిబ్బంది బదిలీ వెళుతున్న మాధురిని, నూతనంగా వచ్చిన ఉమాదేవిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు.

వైభవంగా గరుడ వాహన సేవ



సత్తెనపల్లి(ముప్పాళ్ల): పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల శ్రీ అలివేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామికి బుధవారం అధిక శ్రావణ మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమంజనం శోభాయమానంగా జరిపారు. శ్రీవారికి అత్యంత ఇష్టమైన గరుడ వాహనంపై రైల్వేస్టేషన్ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. శ్రీమాన్ శ్రీచిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజదాసన్ స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

త్రీఫేస్ విద్యుత్‌తో పారిశ్రామికాభివృద్ధి

మంత్రి అంబటి రాంబాబు



కొమెరపూడిలో త్రీఫేస్ విద్యుత్ లైన్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల్ని ఖర్చు చేసి ఐదువేల జనాభా దాటిన పంచాయతీలకు త్రీఫేస్ విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తుందని, తద్వారా పారిశ్రామికాభివృద్ధి కూడా జరుగుతుందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలంలోని కొమెరపూడిలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఏర్పాటుకు బుధవారం భూమి పూజ చేశారు. విద్యుత్ శాఖ నిధుల నుంచి రూ.1.5కోట్లతో లైన్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖకు ఆదాయం పెరగడంతో పాటు గ్రామంలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందని చెప్పారు. తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, పల్నాడు జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, పక్కాల సూరిబాబు తదితరులు ప్రసంగించారు. రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతుసలహా మండలి సభ్యులు కళ్లం విజయభాస్కరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకటి నాగేశ్వరమ్మ, విద్యుత్ డీఈ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చల్లా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సంకటి మహేంద్ర, నాయకులు కరాలపాటి ఫకృద్దీన్, నూరుల్లా, ఏఈ తిరుపతిరావు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు పొలంబడి దోహదం



రైతులకు శిక్షణనిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు

నకరికల్లు: తక్కువ నీటితో నాణ్యమైన ఉత్పత్తులు సాధించేందుకు రైతులకు పొలంబడి ద్వారా ఉత్తమ శిక్షణనిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడిని బుధవారం నిర్వహించారు. ఆరోగ్యకర పంటల సాగు, మిత్ర పురుగుల్ని రక్షించడం, శత్రు పురుగుల్ని అరికట్టడంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలో 1606 మంది రైతులు ఇంకా పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. ఆధార్ లింక్ చేసుకోకుండా 276 దరఖాస్తులు ఉన్నాయని చెప్పారు. 14వ విడత పీఎం కిసాన్ నగదు ఖాతాల్లో జమ చేసుకునేందుకు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని ఆయన సూచించారు. కౌలు రైతులు 1210 మందికి సీసీఆర్సీ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లపాడు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ పంపిణీ



క్రోసూరు: మండలంలోని ఊటుకూరుకు చెందిన వృద్ధురాలు కరుణమ్మ నల్లపాడులో తమ కుటుంబ సభ్యుల వద్ద ఉంటుంది. ఆరోగ్యం బాగాలేక కదలలేని స్థితిలో మంచానికి పరిమితమైంది. విషయం తెలుసుకున్న ఊటుకూరు వలంటీర్ జె.రవికిరణ్ బుధవారం అక్కడకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేశారు. దీంతో కరుణమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. సీఎంకు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వరిలో విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



విత్తనశుద్ధి గురించి వివరిస్తున్న ఏవో వేణుగోపాల్

క్రోసూరు: విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లను అరికట్టవచ్చని మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు. రైతులకు బుధవారం క్రోసూరు ఆర్బీకే-1లో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. వరి పంటలో పాము పొడ, అగ్గి, ఆకుమచ్చ తెగుళ్లు, ప్యూజేరియం, ఆల్టర్నేరియా, బూజు తెగుళ్లు విత్తనం ద్వారా వస్తాయని తెలిపారు. వరిలో తడి, పొడి పద్ధతిలోనూ జీవశిలీంద్రనాశిని (సూడోమోనోస్ ఫ్లోరాసెస్స్) విధానంలో విత్తన శుద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఏవో రైతులకు సూడోమోనోస్ ఫ్లోరాసెస్స్ ద్వారా విత్తన శుద్ధిని చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలుడి చికిత్సకు మరో రూ. 10లక్షలు మంజూరు

- తొలుత రూ.10 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవతో మరో రూ. 10లక్షల సాయం



సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

క్రోసూరు: ప్రాణాపాయస్థితిలో ఉన్న ఏడేళ్ల బాలుడికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధి అధికారులతో మాట్లాడి మొత్తం రూ.20 లక్షలు మంజూరు చేయించారు. క్రోసూరుకు చెందిన షేక్ చిన్నసైదా, బీహాజరాల కుమారుడు షేక్ మహమ్మద్ అష్రాఫ్ లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ అండ్ లివర్ డిసీజెస్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు లివర్ ప్లాంటేషన్ తప్పనిసరని చెప్పారు. చేతిలో చిల్లిగవ్వలేని పేద కుటుంబం కావడంతో వారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గత గురువారం క్రోసూరు పార్టీ కార్యాలయం వద్ద కలుసుకుని ఆవేదన తెలియజేశారు. బాలుడి ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.10 లక్షల విలువైన లోన్ ఆఫ్ క్రెడిట్‌ను తల్లిదండ్రులకు అందజేశారు. అయితే, లివర్ ఆపరేషన్‌కు మొత్తం రూ.20 లక్షలు కావాలని వైద్యులు చెప్పడంతో బాలుడి తల్లిదండ్రులు తిరిగి ఎమ్మెల్యేను కలుసుకున్నారు. ఆయన వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడి మిగతా రూ.10 లక్షలు సహాయం అందజేయాలని కోరారు. దీంతో సీఎంఆర్ఎఫ్ అధికారులు ఎమ్మెల్యే కోరిన విధంగా బుధవారం రూ. మరో 10 లక్షలు మంజూరు చేశారు. మొత్తం రూ.20 లక్షల అనుమతి ఎల్‌వోసీ మంజూరు చేయగా బాధిత కుటుంబానికి అందజేశారు. పేద కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యేకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కిల్కారి మొబైల్ అకాడమి, ఈ-ఆశ యాప్‌లపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్, పద్మజ

ముప్పాళ్ల: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిల్కారి మొబైల్ అకాడమి, ఈ-ఆశ యాప్‌లపై శిక్షణ బుధవారం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈ-ఆశ యాప్ ప్రోగ్రాం ఆఫీసర్ నందిగం సురేష్ పాల్గొన్నారు. యాప్‌లో రోజువారి చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. కిల్కారి మొబైల్ అకాడమీల గురించి ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. మాతా శిశు సంరక్షణ సేవలు, హైరిస్క్ ప్రెగ్నెంట్ ఉమెన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మజ వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పి. రమాదేవి, సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, ఎం.జోస్పిన్‌రాణి, సీహెచ్. భవానీకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాపుల నిరసన ర్యాలీని అడ్డుకోవడంతో ఉద్రిక్తత



అమరావతి మెయిన్ రోడ్డులో ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

అమరావతి: కులం పేరుతో దూషించిన వారిని అరెస్టు చేయనందుకు నిరసనగా కాపులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించడానికి యత్నించారు. అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో అమరావతిలో ఉద్రిక్తత నెలకుంది. తమ కులాన్ని కించపరుస్తూ దూషించిన మేకల వెంకట్‌పై ఇంత వరకుల పోలీసులు కేసు నమోదు చేయలేదంటూ వందల మంది కాపులు బుధవారం పోస్టాఫీస్ సెంటర్‌లోని వంగవీటి రంగా విగ్రహం దగ్గరకు ఉదయం 11గంటలకు చేరుకున్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ ప్రారంభించడానికి యత్నించారు. నిరసన ర్యాలీకి పోలీసుల అనుమతి లేదని సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది అడ్డుకున్నారు. కొంతమంది కాపు యువకులు ర్యాలీ నిర్వహించడానికి రోడ్లపై పరుగులు తీశారు. ఇందులో 30మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వ్యాన్ ఎక్కించారు. ఈ క్రమంలో వారు నినాదాలు చేస్తూ రోడ్లపై బైఠాయించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన వాయిస్ మెసేజ్‌లు ఆధారంగా కేసు నమోదు చేయడానికి సాంకేతిక కారణాలు అడ్డుగా ఉన్నాయని తెలిపారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారులతో పాటు న్యాయస్థానానికి విన్నవించామని చెప్పారు. న్యాయస్థానం అనుమతి రాగానే వెంటనే కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో లోతుగా విచారించి, నిందితుడ్ని అరెస్టు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందిన కాపులు నిరసన విరమించగా, పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని కూడా వదిలి పెట్టారు. ర్యాలీలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున కాపులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో పరిపూర్ణ ఆరోగ్యం



అచ్చంపేటలో కిట్స్ పంపిణీ చేస్తున్న తహసీల్దారు పద్మాదేవి తదితరులు



అమరావతిలో కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మేకల హనుమంతరావు తదితరులు



నకరికల్లులో కిట్లను పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, అధికారులు



బెల్లంకొండలో పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపీపీ పద్మావెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్

అచ్చంపేట: వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా మెరుగైన ఆరోగ్య వంతులుగా జీవించవచ్చని తహసీల్దారు సీహెచ్. పద్మాదేవి తెలిపారు. టేక్ హోం రేషన్ పంపిణీలో భాగంగా స్థానిక జెడ్పీ అతిథి గృహంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ నెల నుంచి గర్భిణులు న్యూట్రిషియన్ ఫుడ్ కిట్లను ఇంటికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఇందులో మూడు కిలోల ఫోర్టిఫైడ్ బియ్యం, కేజీ కందిపప్పు, 500 గ్రాముల శనగనూనె, 25 గుడ్లు, ఐదు లీటర్ల పాలు, కిలో అటుకులు, రెండు కిలోల రాగిపిండి, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశనగ పప్పు చెక్క, పావు కిలో కర్జూరాలు ఉంటాయని తెలిపారు. సమావేశానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ కంబాల వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

- రుద్రవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు టి.మహేశ్వరరెడ్డి, అనుముల సాంబిరెడ్డి, ఈమని బ్రహ్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మేకా మల్లేశ్వరి ఆధ్వర్యంలో పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు.
- గ్రంథశిరిలో మాజీ సర్పంచ్ రావెళ్ల శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మన్ కోటపాటి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు కిలారి విజయలక్ష్మి, నాగరాజు ఉషారాణి తదితరులు వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు.
- కొండూరు, పెదపాలెం, కోనూరు, కస్తల, తాళ్లచెరువు, మాదిపాడు, తాడువాయి, చల్లగరిగ, చింతపల్లి, చెరుకుంపాలెం, వేల్పూరు తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు కిట్స్ పంపిణీ చేశారు.

అమరావతిలో..

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా బుధవారం అమరావతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో 75త్యాళ్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం ప్రారంభించారు. గర్భిణులకు ఎంపీపీ మేకల హనుమంతరావు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. భవిష్యత్‌లో పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని, నేడు గర్భిణులకు ప్రభుత్వం బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా రోగనిరోధకశక్తి పెరగడానికి అవసరమైన బియ్యం, పప్పు, నూనె, కోడిగుడ్లు, పాలతో పాటుగా వైఎస్సార్ యాత్రి కిట్స్ అందిస్తున్నామని చెప్పారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి గర్భిణులు తీసుకు వెళ్లే వారని, నేటి నుంచి ఇంటి దగ్గరే అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ హమ్మీ, గ్రామ సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగరబాబు, తహసీల్దార్ విజయశ్రీ , డాక్టర్ తేజస్విని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇమాంబి, భారతీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- మల్లాది అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ కంటి వైద్యాధికారి పి. సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- ఎండ్రాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గర్భిణులకు సర్పంచ్ నాయుడు రాంబాబు టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దేవభక్తుని సాంబశివరావు, నాయుడు సాంబశివరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకరికల్లులో...

తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందని మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సచివాలయంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కె.నగేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమీజున్, నాగమణి, కార్యదర్శి భావన్నారాయణ, ఆర్ఐ యువరాజ్, సలీల్, మారెళ్ల శ్రీనివాసరావు, మొగిలి నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రోసూరులో..

స్థానిక జెడ్పీ పాఠశాలలో బుధవారం వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. తల్లిపాల విశిష్టతను పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.స్వర్ణకుమారి, గ్రామ సర్పంచ్ మల్లా చందమామ, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుమల కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు చిల్కా రవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రోశయ్య, ఏసీడీపీవో సరళ, సూపర్‌వైజర్లు మాధవి, బాతాత్రిపుర సుందరి, రత్న, మాణిక్యం, మైమున్నీసా పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఇంటి వద్దకే పోషణ కిట్ల పంపిణీని మండలంలోని గణపవరంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి బుధవారం ప్రాంరభించారు. అంచులవారిపాలెంలో సర్పంచ్ రామాంజనేయులు, రెడ్డిగూడెంలో సర్పంచ్ జరీనాతాజ్‌సాదుల్లా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ మంచు నందనం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రసన్నరాణి, వైస్ ఎంపీపీ హరి సూరమ్మ, వేపూరి స్వామిశంకరరావు, అంచుల పుల్లయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి, సోషల్ మీడియా కో-కన్వీనర్ జాని, మార్కెట్ యార్డు డైరెక్టర్ బాషా, పీఎస్ మిల్క్‌రాజు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

పోషకాహారలోపాన్ని అధిగమించి అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లన ఇంటికి పంపిణీ చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ ఎం.జె.ఎం.రామలింగారెడ్డి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతుభరోసా కేంద్రంలోని మీటింగ్ హాలులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీవో పి.పుట్టారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శిరిగిరి గోపాలరావు, నక్కా శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి, రాజ్యలక్ష్మి, ఎం.కమలాదేవి, పి.జమీలాబేగం, జి.రోజ్‌మేరి, జి.చాముండేశ్వరి, ఎం.పద్మావతి, ఎస్.శ్రీలక్ష్మి, ఎం.మల్లేశ్వరి పాల్గొన్నారు.

- సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెనలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గర్నెపూడి సర్పంచ్ గుగ్గిలం అంకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు యాంపాటి కోటిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా ఇళ్ల వద్దకే పోషకాహారం అందజేస్తున్నట్లు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడులోని జేబీ పాఠశాల, 75 త్యాళ్లూరులోని జేబీ పాఠశాల, హుస్సేన్ నగరంలోని సచివాలయం వద్ద కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ మున్ని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్, సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, తహసీల్దారు క్షమారాణి, ఎంపీడీవో నరసింహారావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు పాల్గొన్నారు.

బెల్లంకొండలో..

మండల కేంద్రమైన బెల్లంకొండలో ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి పోషకాహారం పంపిణీలో పాల్గొన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే పోషకాహారంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, కో- ఆప్షన్ మెంబర్ దరియా, బడా బచ్చా, మౌలాలి, ఆయుర్వేద వైద్యుడు ఆర్. శ్రీనివాస్, సూపర్‌వైజర్లు వనజ, పరిమళ పాల్గొన్నారు.



ముప్పాళ్లలో కిట్లు అందిస్తున్న తహసీల్దార్ భవానీ శంకర్, ఎంపీడీవో పుట్టారెడ్డి, నాయకులు



గణపవరంలో పౌష్టికాహారం కిట్ల పంపిణీ



క్రోసూరులో కిట్లు అందజేస్తున్న సీడీపీవో స్వర్ణకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు



పెదకూరపాడులో పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్న అధికారులు

నకిలీ టీపొడి స్వాధీనం

సత్తెనపల్లి(ముప్పాళ్ల): పట్టణంలోని పలు దుకాణాల్లో రూ.3లక్షల విలువ చేసే నకిలీ టీ పొడిని స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం జరిగింది. విజిలెన్స్ అండ్ హిందూస్తాన్ యూనిలీవర్ లీగల్ టీం ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని శ్రీ అంబికా జనరల్ స్టోర్స్‌పై దాడి చేసి నకిలీ టీ పొడిని గుర్తించారు. సుమారు 150 పెట్టెల సరుకును స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. వీటి విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని అంచనా. దుకాణ యజమానిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీ కంపెనీ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందడంతో పలు దుకాణాల్ని మూసివేశారు. నరసరావుపేటలోనూ తనిఖీలు జరిపినట్లు సమాచారం.

వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

ముప్పాళ్ల: సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్తెనపల్లి జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల బదిలీలపై వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిని ఘనంగా సన్మానించారు. వేరే జోన్‌ల నుంచి బదిలీపై వచ్చిన వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, స్కూల్‌గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ ఏ.శ్రీరాంరెడ్డి, ఐ.ఎస్.నాగిరెడ్డి, ఇందిరాప్రియదర్శిని ముఖ్య అతిథులుగా వ్యవహరించారు. సత్తెనపల్లి జోన్ పరిధిలోని సుమారు 32 మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఎస్.కె.రియాజ్, ఏ.చెన్నయ్య, డి.శ్రీనివాసరావు, ఎస్.ఎం.సుభాని, ఏ.శ్రీనివాసరెడ్డి, ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు 17 వరకు గడువు

అచ్చంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 17వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ జె.పద్మ బుధవారం తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. సువిశాలమైన తరగతి గదులు, సొంత ప్రయోగశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంసెట్ ఫ్రీ కోచింగ్ ఇస్తున్నట్లు తెలియజేశారు. ఉచిత పుస్తకాలతో పాటు అమ్మఒడికి అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థుల మానసిక ప్రశాంతతకు నిత్యం యోగా చేయిస్తామని, దీనికి ఇన్‌స్ట్రక్టర్‌ని నియమించినట్లు చెప్పారు. విద్యార్థులకు మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

వలంటీరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి(ముప్పాళ్ల): పట్టణంలోని మూడు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ బుధవారం తెలిపారు. పట్టణంలోని వడ్డవల్లి ఏరియా, వడ్డవల్లి, కంభాలబావి సచివాలయాల పరిధిలో ఉన్న మూడు ఖాళీలకు అర్హులు ఈ నెల 5వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

5న సత్తెనపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి(ముప్పాళ్ల): సత్తెనపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరం ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశానికి గౌరవ సభ్యులు, కో- ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

సచివాలయ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

పెదకూరపాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదురుగా గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్ పరిశీలించారు. పార్టీలకతీతంగా నాణ్యతతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. పెదకూరపాడులో మూడు సీసీ రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తున్నట్లు మీరయ్య తెలిపారు. రెండు రోజులు ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఎంపీడీవో నరసింహారావు, తహసీల్దారు క్షమారాణి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

క్రోసూరు: లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాష్ట్ర చర్మకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మల్లా చందమామ, పీహెచ్‌సీ వైద్యురాలు బాలఅంకమ్మబాయిపాల్గొన్నారు.